## నేడు జేపీ నడ్డా రోడ్ షో

**నిజాంపేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):** నిజాంపేట కార్పొరేషన్‌లో భవ్యాస్ అపార్ట్‌మెంట్ నుంచి హనుమాన్ టెంపుల్ వరకు సోమవారం నిర్వహించనున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రోడ్ షో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ నిజాంపేట కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్ నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంపై సమీక్ష చేయడానికి మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, బీజేపీ నాయకులు పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలు సూచనలు, సలహాలు చేశారు.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

## పూర్వవిద్యార్థుల ఆత్మీయసమ్మేళనం

**పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):** కొంపల్లి పురపాలక సంఘం పరిధిలోని దూలపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ 2003-04 పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆత్మీయసమ్మేళన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆనాటి విద్యార్థులు పాతనాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తుకున్నారు. 20 సంవత్సరాల క్రితం విద్యార్థులుగా ఏ తరగతి గదిలో కూర్చొన్నారో, ఆ గదిలోనే కార్యక్రమం నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని పూర్వవిద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

## 'ఆక్వా టన్నెల్ ఎగ్జిబిషన్-24' ప్రారంభం

**కూకట్‌పల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** కూకట్‌పల్లిలోని హెచ్ఎండీఏ ట్రక్ పార్కింగ్ స్థలంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆక్వా టన్నెల్ ఎగ్జిబిషన్-24ను ఆదివారం నుంచి ప్రజలకు అందుబాటులోకి ఉంటుందని నిర్వాహకులు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. వినోదం, విజ్ఞానం, ఆటవిడుపు, షాపింగ్ అనుభూతి ప్రజలకు అందించాలన్న లక్ష్యంతో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించామన్నారు. ముఖద్వారంలో అండర్ వాటర్ టన్నెల్ స్కూబా డైవింగ్ సౌకర్యం కల్పించామన్నారు. అండర్ వాటర్ టన్నెల్‌లో 600 రకాల చేపలు సందర్శకులకు కనువిందు చేయనున్నాయి. 60 రోజుల పాటు ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.



వ్యాధులపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు తల్లిదండ్రులు

## ఉచిత మెగా వైద్యశిబిరం

**కూకట్‌పల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** కూకట్‌పల్లిలోని రామ్‌దేవ్‌రావు ఆసుపత్రిలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. సుమారు 600 మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకొన్నారు. ఆసుపత్రి వైద్యులు పరీక్షలు చేయడంతో పాటు వ్యాధుల నివారణ పట్ల అవగాహన కల్పించారు. అదేవిధంగా చిన్నపిల్లల్లో వచ్చే వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వైద్యులు కమలాకర్, పి.భవాని, సత్యనారాయణ, కె.కృష్ణ, భానుప్రసాద్, కల్పన, రణదీప్ పాల్గొన్నారు.



కూకట్‌పల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న పట్నం సునీతారెడ్డి, కాంగ్రెస్ నాయకులు

## బీఆర్ఎస్, బీజేపీతోనే రాష్ట్రానికి తీరని నష్టం

**కూకట్‌పల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** బీఆర్ఎస్, బీజేపీ పార్టీలతోనే తెలంగాణకు తీరని నష్టం జరిగిందని, రెండు పార్టీలు తోడుదొంగలు మాదిరి రాష్ట్రాన్ని నాశనం చేసేందుకు కంకణం కట్టుకొన్నాయని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతారెడ్డి ఆరోపించారు. కూకట్‌పల్లి డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీల్లో ఆమె ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించడంతో పాటు పార్టీ కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనకు లక్ష ఓట్ల మెజార్టీ రాబోతుందని, గెలిచిన తర్వాత ప్రజలందరికి అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తానని హామి ఇచ్చారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంతోపాటు కేంద్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైతే రాష్ట్రం గణనీయమైన అభివృద్ధి సాధించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ వినయ్‌రెడ్డి, నాయకులు సత్యం శ్రీరంగం, శేరి సతీష్‌రెడ్డి, తూము వేణు, నాగిరెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, దేశాల్, భీమ్‌రావు, పుష్పారెడ్డి, ప్రవీణ్, రేష్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

● బాలాజీనగర్ డివిజన్ మూసాపేట సమీపంలోని ప్రగతినగర్‌లో యువజనకాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ప్రారంభించారు.

**ఫతేనగర్:** పట్నం సునీతారెడ్డి గెలుపును ఆకాంక్షిస్తూ హస్తం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆమె కూతురు మనీషారెడ్డి ఆదివారం భరత్‌నగర్‌లో ప్రచారం నిర్వహించారు. ఫతేనగర్ డివిజన్ అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రచారంలో కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇంచార్జి బండి రమేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ విజయం తథ్యం

## చేవెళ్ల ఎంపీ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డి



ప్రార్థనల్లో రంజిత్‌రెడ్డి, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి నియోజకవర్గాల ఇన్‌చార్జులు జగదీశ్వర్‌గౌడ్, బండి రమేష్

### కల్వరిటెంపుల్‌లో ప్రార్థనల్లో రంజిత్‌రెడ్డి

**మియాపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** మియాపూర్ కల్వరిటెంపుల్‌లో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి, నియోజకవర్గ ఇన్‌చార్జిలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డి, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి నియోజకవర్గాల ఇన్‌చార్జులు జగదీశ్వర్‌గౌడ్, బండి రమేష్ బ్రదర్ డాక్టర్ పి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో తన విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు.



బాలాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న పారిజాతారెడ్డి తదితరులు

### ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ కనుమరుగు

**సరూర్‌నగర్:** పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పూర్తిగా ప్రతికూల ఫలితాలే రానున్నాయని, ఎన్నికల తర్వాత ఆ పార్టీ కనుమరుగు కాక తప్పదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం బాలాపూర్, బడంగ్‌పేట్, నాదర్‌గుల్‌లోని పలు డివిజన్లలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఆమె ప్రచారం నిర్వహించారు. రంజిత్‌రెడ్డికి ఓటేసి మెజారిటీ అందించాలని కోరారు.

### కాంగ్రెస్ హస్తం ప్రజల నేస్తం

**ఎల్బీనగర్:** కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమాన్ని కోరుకునేదని పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం గ్రీన్‌హిల్స్‌కాలనీలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజిత్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్ తదితరులు పాల్గొన్నారు.



గ్రీన్‌హిల్స్ కాలనీ ప్రచారంలో పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి ఇతరనేతలు



డాక్టర్స్‌కాలనీలో ప్రచారం చేస్తున్న వక్కలంక శ్రీనివాస్‌రావు, బాలకిషన్

### సరూర్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం

**ఎల్బీనగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):** చేవెళ్ల ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని డాక్టర్స్‌కాలనీ, జేబీకాలనీ, డాక్టర్స్‌కాలనీ సౌత్‌లలో డీసీసీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు, పారుపల్లి దయాకర్‌రెడ్డి, బేర బాలకిషన్, ఆకుల అరవింద్‌కుమార్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శంకర్‌యాదవ్, యువజన కాంగ్రెస్ నాయకుడు ధన్‌రాజ్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తు హస్తం గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు శ్రీనివాస్, రామ్మూర్తి, సుదర్శన్‌ముదిరాజ్, నయీమ్, ఇమ్రాన్, మహమ్మద్‌అలీ, అరుణ, నాగమణి, లోడి నరసింహగౌడ్, కొయ్యడ జనార్దన్, జంగారెడ్డి, గంగం కిషోర్, సంతోష్, కర్నాటి శ్రీనివాసులు, కరీం పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరికలు

**షాపూర్‌నగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకే బీఆర్ఎస్, బీజేపీ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నారని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్‌కు చెందిన బీజేపీ నేత విజయ్‌కుమార్‌తో పాటు పలువురు కార్యకర్తలు శ్రీశైలంగౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని కాంగ్రెస్ పార్టీ అన్నివిధాల అభివృద్ధి పరుస్తోందనే నమ్మకం తనకు ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాబోవు రోజుల్లో తెలంగాణ అభివృద్ధిలో అగ్రగామిగా నిలుస్తుందన్నారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ పార్టీ సృష్టించిన విధ్వంసం నుంచి రాష్ట్రం ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని తెలిపారు. కూన నాయకత్వాన్ని బలపరిచేందుకు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో సన్నే విజయ్‌కుమార్, విష్ణు, ఆదినారాయణ, మినాష్, సాయికిరణ్, శంకర్, లింగం, హరీష్, దయా, నగేష్, మణికంఠలు ఉన్నారు.

## భర్త ఇంటికి రావడం లేదని భార్య ఆత్మహత్య

**పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):** భర్త ఇంటికి రావడం లేదని మనస్తాపం చెందిన భార్య ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకకు చెందిన శ్రీనివాస్, రేణుక(24) భార్యాభర్తలు. వీరు బతుకుదెరువు కోసం నగరానికి వలసొచ్చి కుత్బుల్లాపూర్ ఎంఎన్‌రెడ్డినగర్‌లో నివాసం ఉంటూ చిత్తు కాగితాలు ఏరుకొని జీవనం సాగిస్తున్నారు. ఇటీవల భార్యాభర్తలు గొడవపడడంతో భర్త ఇంటి నుంచి వెళ్లిపోయాడు. భర్త తిరిగి ఇంటికి రావడంలేదనే మనస్తాపంతో ఈ నెల 25న రేణుక ఉరేసుకొంది. గమనించిన స్థానికులు తలుపులు పగులగొట్టి ఆమెను ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వైద్యుల సూచన మేరకు గాంధీ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చిక్సిత పొందుతున్న రేణుక పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందింది.

### భార్య పుట్టింటి నుంచి రావడం లేదని భర్త..

భార్య పుట్టింటి నుంచి రావడంలేదని మనస్తాపం చెందిన భర్త పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లికి చెందిన కుమ్మరి రాములు(46) భార్యతో గొడవ పడడంతో వారం రోజుల క్రితం ఆమె తాండూరులోని పుట్టింటికి వెళ్లి అక్కడే ఉంటుంది. భార్య తిరిగి తన ఇంటికి రావడంలేదని మనస్తాపం చెందిన రాములు ఈనెల 27 రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి, భార్యకు పురుగుల మందు డబ్బాని ఫొటో తీసి వాట్సాప్‌లో పంపించాడు. భార్య పుట్టింటి నుంచి వచ్చి రాములును గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లింది. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న రాములు పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు.

### ఆర్థిక ఇబ్బందులతో..

ఆర్థిక ఇబ్బందులతో ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట గ్రామానికి చెందిన అర్కెల మహేష్(28) బతుకుదెరువు కోసం కుటుంబసభ్యులతో వలస వచ్చి ఎన్‌సీఎల్ నార్త్‌లో నివాసం ఉంటున్నాడు. కొద్ది రోజులు క్యాబ్ డ్రైవర్‌గా పని చేశాడు. ఇటీవల ట్రాలీ ఆటోను కొనుగోలు చేశాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువకావడంతో ఇంటో ఎవరూలేని సమయం లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు. మహేష్ మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

### మహిళ ఆత్మహత్యాయత్నం

**రాంగోపాల్ పేట్:** కుటుంబ కలహాలతో ఓ మహిళ ఆదివారం హుస్సేన్‌సాగర్‌లో దూకి ఆత్మహత్యకు యత్నించింది. సెక్రటేరియట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్‌కు చెందిన మహిళ(33)కు వివాహమై ఎనిమిదేళ్లు అయినా పిల్లలు కాలేదు. దీంతో అత్తింటి వారి వేధింపులు ఎక్కువ కావడంతో మానసికంగా కృంగిపోయిన మహిళ ఆదివారం మధ్యాహ్నం సెక్రటేరియట్ నార్త్ ఈస్ట్‌గేట్ ఎదురుగా ఉన్న హుస్సేన్‌సాగర్‌లోకి దూకింది. అదే సమయంలో సెక్రటేరియట్ గేటు వద్ద విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ టీఎస్ఎస్పీ కానిస్టేబుల్ అశోక్‌ను అప్రమత్తం చేయగా, ఆయన వెంటనే ఆ మహిళను కాపాడి పోలీసులకు అప్పగించాడు. పోలీసులు ఆమె కుటుంబసభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

## లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

**ఓల్డుబోయినపల్లి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):** ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్ నాయకులు, కార్యకర్తలను కోరారు. లక్ష్మారెడ్డి గెలుపు కోసం గంగపుత్ర కాలనీలో ఉన్న మహంకాళీ అమ్మవారి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి డివిజన్‌లోని పలు బస్తీలలో పాదయాత్ర చేస్తూ ఇంటింటికి వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని డివిజన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు నరేందర్‌గౌడ్, కర్రెజంగయ్య, ఎజాజ్, ఇర్ఫాన్ పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

● కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాలానగర్‌లో, కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఫతేనగర్‌లో ప్రచారం చేశారు.

**పేట్‌బషీరాబాద్:** బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే కొంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి చెందిందని మున్సిపల్ చైర్మన్ సన్నా శ్రీశైలంయాదవ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా అశ్వినికాలనీ, న్యూజువీడు కాలనీల్లో ప్రచారం చేశారు.

● రాగిడి లక్ష్మారెడ్డి విజయాన్ని ఆకాంక్షిస్తూ సూరారం డివిజన్ శ్రీరాంనగర్‌లో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్‌లు ప్రచారం నిర్వహించారు. మహిళా అధ్యక్షురాలు హేమలతరెడ్డి, కాలనీ ప్రెసిడెంట్ సుధాకర్, రామకృష్ణ, సత్యనారాయణ, సతీష్, కరుణాకర్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.



ఓల్డుబోయినపల్లిలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ నర్సింహాయాదవ్

**గాజులరామారం:** మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా గాజులరామారం బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు.

### బైక్ ర్యాలీ

**షాపూర్‌నగర్:** పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. సూరారం కట్టమైసమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, రాగిడి లక్ష్మారెడ్డి విజయాన్ని కోరుతూ బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌లను బీసీ-ఏ జాబితాలో చేర్చొద్దు

● సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను వెనక్కితీసుకోవాలి

● తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం, బీసీ ఏ కుల సంఘాలు

**పంజాగుట్ట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):** తెలంగాణలో ముదిరాజ్ సామజిక వర్గాన్ని బీసీ-ఏ జాబితాలో చేర్చవద్దని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం, బీసీ-ఏ కుల సంఘాలు డిమాండ్ చేశాయి. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడప శ్రీహరి, నగర అధ్యక్షుడు చాట్ల సదానంద్, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ బాగయ్య, బీసీ-ఏ కులాల ఐక్య వేదిక అధ్యక్షుడు ఎం.ఎస్ నరహరి, తదితరులు మాట్లాడారు. ఈ నెల 14న నారాయణపేట్‌లో జరిగిన ఎన్నికల బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి బీసీ-డి గ్రూపులో ఉన్న ముదిరాజ్‌లను అత్యంత వెనుకబడిన బీసీ-ఏ జాబితాలో కలుపుతామని అనడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, లేకపోతే కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేస్తామని వారు హెచ్చరించారు. ప్రస్తుతం సుప్రీం కోర్టులో కేసు పెండింగులో ఉందని, ఎన్నికల కోడ్ ఉండగా సీఎం మాట్లాడడం.. కోర్టు ధిక్కారం కాదా.. అని వారు ప్రశ్నించారు. అనంతరామన్ కమిషన్ నివేదికను తుంగలో తొక్కి ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కులాల మధ్య చిచ్చుపెట్టుతున్నారని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో, ప్రస్తుతం ముదిరాజ్ సామాజిక వర్గం వారు ఎన్నో పదవులు అనుభవించారని, అలాంటి వారిని యాచక కులాలు, దేశ దిమ్మరులు, చట్టసభలు ఎలా ఉంటాయో కూడా తెలియని బీసీ-ఏ కలపాలను కోవడం శోచనీయమన్నారు. జనాభాలో 10 శాతం ఉన్న వారిని ఏ శాస్త్రీయ పద్ధతి లేకుండా 18 శాతం ఉన్న 57 కులాలలో కల్పడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. వారిని బీసీ-ఏలో కలిపే ముందు అత్యంత వెనుకబడిన కులాలను ఎస్సీ, ఎస్టీ జాబితాలో కలిపిన తరువాత, ముదిరాజ్‌లను ఏ జాబితాలో అయినా కలుపుకోగలరని అన్నారు. గంగపుత్రులకు, బీసీ-ఏ కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి స్పందించి వెంటనే తన వ్యాఖ్యలు ఉపసంహరించుకుని ఒక ప్రకటన చేయాలన్నారు. త్వరలో సీఎంను కలిసి వాస్తవాలను వివరిస్తామని వారు తెలిపారు. ఈ సమావేశంలో బీసీ-ఏ కుల సంఘాల నాయకులు డాక్టర్ బి.లక్ష్మయ్య, బాలరాజు, ముత్యాల నర్సింహులు, జి.శివరత్నం, పిల్లి శంకర్, ఓం ప్రకాష్, ఉసా నర్సింహ బెస్త, మల్లేష్, స్వర్ణలత, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# మోదీ నాయకత్వంపై దేశ ప్రజల నమ్మకం

### కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు

**ఫతేనగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):** మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థిగా ఈటల రాజేందర్ పేరును అధిష్టానం ప్రకటించడంతో అప్పుడే ఆయన గెలుపు ఖరారైందని కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. ఆదివారం నాయకులు, కార్యకర్తలతో కలిసి ఫతేనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదట పండిట్ దీన్‌దయాళ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ.. భారత్‌ను విశ్వగురువు స్థానంలో నిలిపేందుకు విద్యావంతులు, మేధావులు మోదీని మూడోసారి ప్రధానిగా గెలిపించాలని నిర్ణయించుకున్నారన్నారు. ఉద్యమ నాయకుడు, రెండు సార్లు మంత్రిగా ప్రజలకు సేవలందించిన ఈటలను ప్రచారంలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ఈ ఎన్నికల్లో ఆయన విజయం సాధించి తీరుతామని ధీమాను వ్యక్తం చేశారు. ప్రచారంలో కంచి మహేందర్, ముద్దాపురం కృష్ణగౌడ్, రామ్మోహన్, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### సంక్షేమ పథకాలు అమలు చేయాలి

**తిరుమలగిరి:** అబద్ధాలు, మోసాలతో ప్రజలకు అమలు కాని వాగ్దానాలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నాడని, అలాంటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శలు చేయకుండా ప్రజా సంక్షేమం కోసం పాటుపడాలని మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కంటోన్మెంట్ నియోజకవర్గం వార్డ్-7 అరుణ్ ఎన్‌క్లేవ్‌లో కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రజలకు చేయవలసిన పనులను విస్మరించి బీజేపీపై దుష్ప్రచారం చేయడం మానుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీజేపీ కంటోన్మెంట్ అభ్యర్థి వంశాతిలక్ మాట్లాడుతూ ఈటల రాజేందర్ సహకారంతో నియోజకవర్గంలో సమస్యలను పరిష్కరిస్తానని, తనకు ఒకసారి అవకాశం ఇవ్వాలని విజప్తి చేశారు. కార్యక్రమంలో వార్డ్-7 బీజేపీ అధ్యక్షుడు ప్రభు ప్రశాంత్, పవన్, సుధీర్, విశ్వనాథ్, శ్రీధర్‌రెడ్డి, శ్రీకాంత్, విజయ్, సునీల్, శేఖర్, మార్షల్, ప్రభు, ఉదయ్‌కుమార్, హరికృష్ణ, మోహన్, శ్రీధర్, తరుణ్‌లు పాల్గొన్నారు.



దీన్‌దయాళ్ ఉపాధ్యాయ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంతారావు, నాయకులు



కంటోన్మెంట్‌లో మాట్లాడుతున్న ఈటల రాజేందర్



బీఆర్ఎస్ నాయకుడిని బీజేపీలోకి ఆహ్వానిస్తున్న ఈటల రాజేందర్

### బీజేపీలో చేరికలు

**కొత్తపేట:** నాగోల్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. నాగోల్ శుభం ఫంక్షన్‌హాల్ ఆవరణలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పంగా శ్యాంకుమార్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఇటీవల బీజేపీలో చేరిన సుర్వి రాజుగౌడ్ ఆధ్వర్యంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి సమక్షంలో 20 మంది స్థానిక నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు.

● బీజేపీకి ఓటు వేసి ఈటలను గెలిపించాలని ఆపార్టీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం నాగోల్ డివిజన్ పరిధిలోని పోలింగ్ బూత్ నెం.92లో ప్రచారం చేశారు.

## నేడు బీజేపీలో చేరనున్న కార్పొరేటర్

**గాజులరామారం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):** కుత్బుల్లాపూర్ నియోజవర్గంలోని బీఆర్ఎస్ పార్టీకి బిగ్‌షాక్ తగిలింది. బీఆర్ఎస్ హ్యాట్రిక్ కార్పొరేటర్ బీజేపీలోకి చేరనున్నారు. గాజుల రామారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్ రావుల శేషగిరి తన అనుచర గణంతో నేడు నిజాంపేట్‌లో జరుగనున్న జేపీ నడ్డా రోడ్ షోలో బీజేపీ తీర్థం పుచ్చుకోనున్నారు. ఇటీవల మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను ఓ కార్యక్రమంలో కలిశారు. కుత్బుల్లాపూర్ నియోజవర్గానికి చెందిన బీజేపీ నాయకులతో గాజుల రామారంలో ర్యాలీగా బయలుదేరనున్నారు. గతంలో ఒక్కసారి కౌన్సిలర్‌గా, మూడు సార్లు కార్పొరేటర్‌గా గెలిచారు. కార్పొరేటర్ రావుల శేషగిరి బీజేపీలో చేరడంతో కుత్బుల్లాపూర్ నియోజవర్గంలోని బీజేపీకి మరింత బలం చేకూరనున్నది.

## 'కాంగ్రెస్‌తోనే శేరిలింగంపల్లి అభివృద్ధి'

**మియాపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):** శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, ప్రతీ కార్యకర్త ఓ సైనికుడిలా పని చేసి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. ఆదివారం మాదాపూర్ సుభాష్‌చంద్రబోస్‌నగర్ నుంచి నాయకుడు ఇస్మాయిల్ ఆధ్వర్యంలో పలువురు జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘర్షణకు దారి తీసిన భూ పంచాయితీ

● గాగిల్లాపూర్‌లో పోలీసుల సాయంతో స్థల స్వాధీనానికి యత్నం

● అడ్డుకున్న బాధితులు, గ్రామస్థులు

● స్టేషన్‌కు పదిమంది మహిళల తరలింపు

**నిజాంపేట్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి):** గాగిల్లాపూర్ గ్రామంలో భూ పంచాయితీ ఘర్షణకు దారి తీసింది. పది రోజుల క్రితం మొదలైన ఈ పంచాయతీ ఆదివారం పోలీసుల జోక్యంతో ఉద్రిక్తంగా మారింది. భూమిని స్వాధీనం చేసుకునేందుకు వచ్చిన వారిని బాధితులు, గ్రామస్థులు అడ్డుకోవడంతో పోలీసులు కొందరు మహిళలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గ్రామంలోని సర్వే నంబరు 235లో ఉన్న భూమి ఇరు వర్గాల పేరిట పట్టాలుండడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

సుమారు 40 ఏళ్ల క్రితం కొన్న ఏడెకరాల భూమి మోరా రాజయ్య, నర్సింహులు, గణేష్ పేర్ల మీద ఉంది. వీరు ధరణిలో అప్‌డేట్ చేసుకోకపోవడంతో ఆ భూమిలో కొంత భూమిని మొదటి యజమాని అల్వాల్ ప్రాంతానికి చెందిన వ్యక్తులకు 2023లో అమ్మినట్టుగా తెలుస్తోంది. అయితే, ఈ భూమి మీద ఇరువురికి పట్టాదార్ పాస్ బుక్‌లు ఉండడం అయోమయానికి దారితీసింది. కొనుగోలు చేసిన అల్వాల్ ప్రాంత వాసులు కోర్టు ఆర్డర్‌తో భూమిని స్వాధీనం చేసుకోవడానికి పోలీసులతో వచ్చి కబ్జాలో ఉన్న ఆరుగురిని ఇటీవల అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఇదిలాఉండగా అల్వాల్ ప్రాంత వాసులు ఆదివారం పోలీసులు, ఎక్స్‌కవేటర్ సహాయంతో గాగిల్లాపూర్ చేరుకుని పొలంలో ఉన్న నిర్మాణాలను తొలగించి భూమిని స్వాధీనం చేసుకోవడానికి వచ్చారు. దీంతో ఇన్నాళ్లు సేద్యం చేస్తున్న మోరా కుటుంబంలోని మహిళలు, వృద్ధులతో సహా అందరూ వారికి అడ్డుపడ్డారు. తమ వద్ద పొలానికి సంబంధించి ధరణి పత్రాలు, కోర్టు ఇంజక్షన్ ఆర్డర్స్ ఉన్నాయని, వాటిని పరిశీలించాలని కోరినా పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ అడ్డుకున్న దాదాపు 10 మంది మహిళలను పోలీస్ స్టేషన్ తరలించారు. ఆ తర్వాత ఎక్స్‌కవేటర్‌తో పనులు ప్రారంభించారు. తమ కుటుంబ సభ్యులను జైలుకు పంపి ఇలా దౌర్జన్యం చేయడం ఏమిటని బాధిత కుటుంబీకులు పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్థులు ఎవరైనా మాట్లాడితే పోలీస్ స్టేషన్ తరలిస్తామని పోలీసులు హెచ్చరించడంతో అంతా వెనకడుగు వేశారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.



ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకున్న వారిని తప్పిస్తున్న పోలీసులు